నమస్తే తెలంగాణ
సంగారెడ్డి
I | హైదరాబాద్, శనివారం 7 జూన్ 2025 | SANGAREDDY

## పోడు భూములకు సోలార్ పంపుసెట్లు

సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ క్రాంతి

సంగారెడ్డి కలెక్టరేట్, జూన్ 6: పోడు పట్టా భూములు పొందిన రైతులకు సోలార్ పంపుసెట్లు అందించాలని అధికారులను సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆదేశించారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఇందిరా సౌర గిరి వికాసం పథకంపై గిరిజన సంక్షేమ శాఖ, వ్యవసాయ, అటవీ శాఖ, సంబంధిత శాఖల అధికారులతో శుక్రవారం ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో 2024-25 సంవత్సరానికి 73 మంది రైతులను గుర్తించాలన్నారు. రెండున్నర ఎకరాల భూమిని ఒక గ్రూప్‌గా తీసుకొని ఆ గ్రూపులోని రైతులకు ఒక యూనిట్ లక్షల రూపాయలతో మోటర్లు, సోలార్ పంప్‌సెట్లు పంపిణీ చేయాలన్నారు. వ్యవసాయం, పండ్ల తోట్ల పెంపకంపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, గిరిజన సంక్షేమ శాఖ అధికారి అఖిలేష్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శివ ప్రసాద్, జిల్లా అటవీశాఖ అధికారి శ్రీధర్‌రావు పాల్గొన్నారు.


రామంచలో పెద్దమ్మ ఆలయం పునర్నిర్మానానికి భూమిపూజ చేస్తున్న హరీశ్‌రావు

# పేదల భూములపై ప్రభుత్వం కన్ను

- దళిత,గిరిజనుల భూములు కాజేసేందుకు ప్రభుత్వం యత్నం..?
- చెర్యాల్‌లో పారిశ్రామిక పార్కు పేరిట భూసేకరణకు సన్నద్ధం
- 120 ఎకరాల అసైన్డ్ భూముల సేకరణకు నోటిఫికేషన్
- ప్రభుత్వం తీరుపై దళిత,గిరిజన రైతుల ఆగ్రహం
- పంటలు పండే భూములు ఇచ్చేందుకు ససేమిరా
- న్యాల్‌కల్‌లో ఫార్మాసిటీ ఏర్పాటుపై తిరగబడ్డ రైతులు
- గమ్మడిదలలో ఇండస్ట్రియల్ పార్కుకు భూములు ఇవ్వని రైతులు

సంగారెడ్డి జిల్లా చెర్యాల్‌లో ఇండస్ట్రియల్ పార్కు కోసం రైతుల నుంచి సేకరించనున్న ప్రతిపాదిత అసైన్డ్ భూములు ఇవే

సంగారెడ్డి, జూన్ 6(నమస్తే తెలంగాణ) : పరిశ్రమల ఏర్పాటు ముసుగులో కాంగ్రెస్ ప్రభుత్వం దళిత, గిరిజనుల భూములు కాజేసేందుకు యత్నిస్తున్నది. ఇండస్ట్రియల్ పార్కు ముసుగులో అసైన్డ్ భూములు లాక్కునేందుకు ప్రయత్నిస్తుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలంలో 'ఫార్మాసిటీ' ఏర్పాటు కోసం ప్రభుత్వం 2వేల పైచిలుకు ఎకరాల అసైన్డ్, పట్టా భూములు సేకరించేందుకు నోటిఫికేషన్ ఇచ్చింది. దీనికి భూములు ఇవ్వమంటూ రైతులు తిరగబడ్డారు. ఇదే తరహాలో గుమ్మడిదలలో ఇండస్ట్రియల్ పార్కు కోసం 157 ఎకరాల అసైన్డ్ భూములు సేకరించేందుకు ప్రభుత్వం నోటిఫికేషన్ ఇవ్వగా, ఇక్కడి రైతులు భూములు ఇచ్చేందుకు నిరాకరించారు. ప్రభుత్వం అడ్డగోలు భూసేకరణకు వ్యతిరేకంగా రైతులు ఆందోళనలు చేపట్టి తిరగబడుతున్నప్పటికీ రేవంత్ సర్కార్ వెనక్కి తగ్గడం లేదు. తాజాగా కంది మండలం చెర్యాల్ గ్రామంలో ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు కోసం దళితులు, గిరిజనులు, బీసీలకు ఇచ్చిన 120 ఎకరాల అసైన్డ్ భూముల సేకరణకు గురువారం నోటిఫికేషన్ జారీచేసింది. చెర్యాల్ గ్రామంలోని 741, 741/1 సర్వే నెంబర్లలోని వంద మందికిపైగా రైతులకు చెందిన అసైన్డ్ భూములను సేకరించేందుకు నోటిఫికేషన్ ఇచ్చింది. ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు పేరుతో ప్రభుత్వం పంటలు పండే భూములు సేకరించడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎట్టి పరిస్థితుల్లో భూములు ఇచ్చేదిలేదంటూ దళిత,గిరిజన రైతులు తెగేసి చెబుతున్నారు. ప్రభుత్వం భూసేకరణపై మొండిగా ముందుకు వెళ్తే పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని రైతులు హెచ్చరిస్తున్నారు.

### రూ.కోట్లు విలువ చేసే భూములు అప్పనంగా కొట్టేసే కుట్ర..?

కోట్ల రూపాయలు విలువ చేసే భూములను ఇండస్ట్రియల్ పార్కు ముసుగులో అప్పనంగా కొట్టేసేందుకు కాంగ్రెస్ తెరలేపిందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సంగారెడ్డి జిల్లా కంది మండలంలోని చెర్యాల్ గ్రామంలో ప్రతిపాదిత 741 సర్వే నెంబర్‌లో 340 ఎకరాలకుపైగా ప్రభుత్వ, అసైన్డ్ భూమి ఉంది. 1965 నుంచి 1970 ప్రాంతంలో అప్పటి ప్రభుత్వం చెర్యాల్‌కు చెందిన భూములు లేని దళితులు, గిరిజన, బీసీలకు ఎకరం నుంచి రెండు ఎకరాల చొప్పున అసైన్ చేసింది. ప్రస్తుతం ప్రభుత్వం భూసేకరణకు నోటిఫికేషన్ ఇచ్చిన 740, 741 సర్వే నెంబర్లలోని 120.16 ఎకరాల వందకు పైగా దళిత, గిరిజన, బీసీ కుటుంబాలకు చెందిన రైతులు పంటలు సాగుచేస్తూ జీవిస్తున్నారు. అసైన్డ్ భూములు పొందిన రైతుల్లో కొంత మంది మరణించగా, ఆ భూములు వారి వారసుల పేరిట కొనసాగుతున్నాయి. కొంత మంది రైతులు ఇంకా జీవించి ఉన్నారు. ఈ భూములు హైదరాబాద్-ముంబయి జాతీయ రహదారి పక్కన, ఐఐటీహెచ్‌కు సమీపంలో ఉంటాయి. దీనికి తోడు రియల్ ఎస్టేట్ వ్యాపారులు పెద్ద సంఖ్యలో ఈప్రాంతంలో వెంచర్లు ఏర్పాటు చేశారు. దీంతో ఇక్కడ ఎకరం భూమి విలువ కోట్ల రూపాయలు పలుకున్నది. కాంగ్రెస్ పార్టీ, ప్రభుత్వంలో పట్టు ఉన్న ఓ కీలక నేత కన్ను చెర్యాల భూములపై పడిందని స్థానికులు చెబుతున్నారు. ఎలాగైనా అసైన్డ్ భూములను చేజిక్కించుకునేందుకు 'ఇండస్ట్రియల్‌పార్కు' పేరుతో పావులు కదుపుతున్నట్లు సమాచారం. ప్రస్తుతం ఇండస్ట్రియల్‌పార్కు కోసం అంటూ 120 ఎకరాల భూసేకరణ చేపడతారు. ఇలా సేకరించిన భూములను టీజీఐఐసీ బదలాయిస్తారు. టీజీఐఐసీ ఈ భూములను అభివృద్ధి చేసి కంపెనీలకు విక్రయిస్తారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన ఓ కీలక నేతకు చెర్యాల్‌లోని 120 ఎకరాల భూములను తక్కువ ధరకు అప్పగించేందుకు ఇండస్ట్రియల్ పార్కు ముసుగులో అసైన్డ్ భూములు సేకరిస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. 741 సర్వే నెంబర్‌లోని అసైన్డ్ భూములు ఉన్న దళిత, గిరిజన, బీసీ రైతులు భూములు అప్పగించేలా చెర్యాల్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నేత ఒకరు అప్పుడే బేరసారాలు ప్రారంభించినట్లు తెలుస్తుంది. అసైన్డ్ భూములు తిరిగి అప్పగించినందుకు ప్రభుత్వం నుంచి ఎకరాకు రూ.60 లక్షలు, ఇంటి స్థలం ఇప్పిస్తామని ప్రైవేటుగా మరో రూ.30 లక్షలు ఇప్పిస్తామని అసైన్డ్‌భూములు ఉన్న రైతులకు ఆశచూపుతున్నట్లు సమాచారం. ప్రభుత్వం తమకు ఇచ్చిన అసైన్డ్‌భూముల్లో ఏండ్లుగా పంటలు పండించుకుని జీవనం సాగిస్తున్నామని, ఆ భూములను తిరిగి ఇవ్వమని రైతులు ఖరాఖండీగా చెబుతున్నట్లు తెలిసింది. ఎకరం రూ.5 నుంచి రూ.7 కోట్లు విలువ చేసే భూములను ప్రభుత్వం నామమాత్రంగా ఇచ్చే పరిహారం డబ్బుల కోసం వదులుకోమని రైతులు తమవద్దకు వచ్చిన మధ్యవర్తులకు స్పష్టం చేస్తున్నట్లు సమాచారం. ప్రభుత్వం బలవంతపు భూసేకరణకు దిగితే ఆందోళన చేస్తామని రైతులు చెబుతున్నారు.

### భూసేకరణపై రెవెన్యూ అధికారుల దూకుడు ..!

కంది మండలం చేర్యాలలో ఇండస్ట్రియల్ పార్కుకు భూసేకరణ కోసం రెవెన్యూ అధికారులు ఉరుకులు పరుగులు పెడుతున్నారు. సాధారణంగా రైతుల భూ సమస్యలు పరిష్కరించేందుకు నెలలు, సంవత్సరాలు సమయం తీసుకునే రెవెన్యూ అధికారులు, చేర్యాల భూసేకరణ విషయంలో తక్షణమే రంగంలోకి దిగారు. చేర్యాల ఇండస్ట్రియల్ పార్కు కోసం 120.16 ఎకరాల భూసేకరణకు గురువారం ఉదయం సంగారెడ్డి కలెక్టర్ నోటిఫికేషన్ ఇచ్చారో లేదో సాయంత్రం కంది తహసీల్దార్ అసైన్డ్ భూముల రైతులతో సమావేశం అయ్యారు. ఈ సమావేశంలో ఇండస్ట్రియల్ పార్కుకు అవసరమైన భూములను వెంటనే అప్పగించాలని తహసీల్దార్ రైతులపై ఒత్తిడి తీసుకువచ్చినట్లు తెలుస్తుంది. ప్రభుత్వం నిబంధనల మేరకు భూములకు నష్టపరిహారం ఇస్తామని, వెంటనే అంగీకరించి భూములు స్వచ్ఛందంగా అప్పగించాలని , లేదంటే బలవంతంగా భూము లు లాక్కోవాల్సి వస్తుందని తహశీల్దార్ రైతులను హెచ్చరించినట్లు సమాచారం. సోమవారం 741 సర్వే నెంబర్‌లోని అసైన్డ్‌భూములు వద్దకు వస్తామని, అక్కడే భూములు కొలిచి స్వాధీనం చేసుకుంటామని, ఎవ్వరూ గొడవలు చేయవద్దని తహశీల్దార్ రైతులను భయభ్రాంతులు గురిచేసినట్లు తెలిసింది. అయితే ఈ సందర్భంగా రైతులు తహసీల్దార్ వ్యవహారశైలిని తప్పుబట్టడంతోపాటు బెదిరింపులకు తాము తలొగ్గమని స్పష్టం చేసినట్లు తెలిసింది. ప్రభుత్వం తప్పనిసరిగా అసైన్డ్‌భూములు స్వాధీనం చేసుకోవాలంటే ఎకరాకు రూ.5 నుంచి రూ.7 కోట్లు చెల్లించాలని, ఇంటి స్థలం, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని అప్పుడే భూములు ఇస్తామని రైతులు ఖరాఖండిగా చెప్పినట్లు తెలుస్తుంది. రైతులతో సమావేశంపై కంది తహసీల్దార్ రవికుమార్ వివరణ కోరగా.. చేర్యాల్‌లో ఇండస్ట్రియల్‌పార్కు ఏర్పాటుకు అవసరమైన 120.16 ఎకరాల భూమి సేకరణ ప్రక్రియ ప్రారంభించినట్లు తెలిపారు. రైతులతో సమావేశం నిర్వహించలేదని, రైతులే తన వద్దకు వచ్చినట్లు చెప్పారు. రైతులను భూములు ఇవ్వాలని ఒత్తిడి తీసుకురాలేదని తెలిపారు. రైతులు మాత్రం తమకు ఎకరాకు రూ.5 కోట్లు పరిహారం ఇస్తేనే భూములు అప్పగిస్తామని వినతి పత్రం ఇచ్చినట్లు చెప్పారు. సోమవారం చేర్యాల గ్రామంలో రైతులతో భూసేకరణపై సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు.

# మత్స్యకారులకు పెద్దపీట

- సిద్దిపేట సెగ్మెంట్‌లో ప్రతి గ్రామంలో పెద్దమ్మ ఆలయం నిర్మించుకున్నాం
- రాష్ట్రంలోనే ఆదర్శంగా రూ.5 కోట్లతో సిద్దిపేటలో ముదిరాజ్ భవన్ నిర్మించాం
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు
- రామంచలో పెద్దమ్మ ఆలయ పునర్నిర్మాణానికి భూమిపూజ

చిన్నకోడూర్, జూన్ 6: బీఆర్ఎస్ ప్రభుత్వంలో మత్స్యకారులకు పెద్దపీట వేశామని, నీటి వనరుల్లో వందశాతం సబ్సిడీపై చేప పిల్లలను వదిలి ఉపాధి చూపినట్లు మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం రామంచలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం పెద్దమ్మ ఆలయ పునర్నిర్మాణ పనులకు ఆయన భూమిపూజ చేశారు. పెద్దకోడూరులో మెట్టుబండల వద్ద పెట్రోల్‌బంకును ప్రారంభించారు. అనంతరం గోనేపల్లిలో పోలేరమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. సిద్దిపేట నియోజకవర్గంలో ముదిరాజ్‌లకు రూ.5కోట్లతో రాష్ట్రంలోనే ఆదర్శంగా ముదిరాజ్ భవనం నిర్మించామని గుర్తు చేశారు. ముదిరాజ్‌ల ఆధ్వర్యంలో ప్రతి గ్రామంలో పెద్దమ్మ ఆలయం నిర్మించుకున్నామని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో మత్స్యకారుల సంక్షేమానికి కృషిచేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వేలేటి రాధాకృష్ణ శర్మ, మాజీ ఎంపీపీ కూర మాణిక్య రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కాముని శ్రీనివాస్, గొర్రెలపెంపకందారుల ఉమ్మడి మెదక్ జిల్లా మాజీ అధ్యక్షుడు శ్రీహరి యాదవ్, గంగాపూర్ సొసైటీ చైర్మన్ కనకరాజు, మాజీ వైస్ ఎంపీపీ పాపయ్య, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మేడికాయల వెంకటేశం, జంగిటి శ్రీనివాస్, ఇట్టబోయిన శ్రీనివాస్, శ్రీకాంత్ యాదవ్, బట్టు లింగం, ఎల్లా గౌడ్, కొండం రవీందర్ రెడ్డి, మాజీ సర్పంచ్లులు, మాజీ ఎంపీటీసీలు, ముదిరాజ్ సంఘం నాయకులు, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు

పెద్దకోడూరులో మెట్టుబండల వద్ద పెట్రోల్ బంకును ప్రారంభిస్తున్న హరీశ్‌రావు

గోనెపల్లిలో పోలేరమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న మాజీమంత్రి హరీశ్‌రావు

## పద్మశాలీల అభివృద్ధి కృషిచేస్తా

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు

హరీశ్‌రావు సమక్షంలో ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గం

సిద్దిపేట టౌన్, జూన్ 6: పద్మశాలీలు ఐక్యంగా ఉండి సంఘ అభివృద్ధికి కృషి చేసుకోవాలని మాజీ మంత్రి హరీశ్ రావు సూచించారు. సిద్దిపేట పట్టణ పద్మశాలి సమాజం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారణ మహోత్సవం పట్టణంలోని మార్కండేయ ఆలయంలో శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హరీశ్‌రావు హాజరై నూతన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..పద్మశాలీల అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. పేదరికంలో ఉన్న పద్మశాలీలకు తన వంతు సహాయ, సహకారం అందిస్తానని భరోసా ఇచ్చారు. మార్కండేయ ఆలయ అభివృద్ధికి పాటుపడుతామన్నారు. మినీ ఫంక్షన్‌హాల్‌కు సహకారం అందిస్తానన్నారు. పద్మశాలీలు రాజకీయం గా, ఆర్థికంగా, సామాజికంగా ఎదగాలని పద్మశాలీ సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కస్తూరి సతీశ్ పిలుపునిచ్చారు. పద్మశాలీ సమాజం అధ్యక్షుడు కాముని రాజేశం మాట్లాడుతూ..పద్మశాలీల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు, సంఘం నేతలు గుండు భూపేశ్, బూర మల్లేశం, ముదిగొండ శ్రీనివాస్, కాముని నగేశ్, భిక్షపతి, అశోక్, రవితేజ, శ్రీహరి, నాగరాజు, ప్రసాద్, శ్రీనివాస్, రాజేంద్రప్రసాద్, సంతోష్, నగేశ్, ప్రకాశ్, రాజ్‌కోటి ఆంజనేయులు, మహేశ్ పాల్గొన్నారు.

మర్కూక్ పోలీస్‌స్టేషన్‌లో పోలీసుల అదుపులో భూనిర్వాసితులు

## మర్కూక్‌లో భూనిర్వాసితుల ముందస్తు అరెస్టు

మర్కూక్, జూన్ 6 : ఆలేరు నియోజకవర్గం తుర్కపల్లి మండలం తిర్మలాపూర్‌లో శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డి బహిరంగ సభ నేపథ్యంలో నర్సన్నపేట రీజినల్ రింగ్ రోడ్డు బాధితులను ముందస్తుగా మర్కూక్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిర్వాసితులు సభకు వెళ్లి ఏమైనా గొడవలు సృష్టిస్తారనే అనుమానంతో ముందస్తుగా అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. సీఎం రేవంత్ సమావేశం ముగిసిన తర్వాత వారిని విడుదల చేశారు. ఈ సందర్భంగా భూ బాధితులు మాట్లాడుతూ.. సీఎం సభకు వెళ్లి తమకు ఎక్కువ పరిహారం ఇప్పించాలని అడుగుదామని అనుకున్నామని, కానీ.. పోలీసులు తమను ముందస్తు అరెస్టు చేయడం బాధాకరం అని ఆవేదన వ్యక్తం చేశారు.

# కాంగ్రెస్ పాలనలో సర్కారు విద్య బలహీనం

- విద్యాశాఖకు మంత్రి లేకపోవడం దురదృష్టకరం
- ఎక్సైజ్ శాఖ మీద ఉన్న శ్రద్ధ విద్యపై సర్కారుకు లేదు
- పేదలపై భారం మోపుతున్న రేవంత్ సర్కారు
- దుబ్బాకలో మాజీ మంత్రి హరీశ్‌రావు

దుబ్బాకలో రజనీకాంత్‌రెడ్డి ఇంటర్నేషనల్ స్కూల్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న హరీశ్‌రావు, కొత్త ప్రభాకర్‌రెడ్డి, బక్కి వెంకటయ్య

హరీశ్‌రావు, కొత్త ప్రభాకర్‌రెడ్డి, బక్కి వెంకటయ్య, ఫరూఖ్ హుస్సేన్‌ను సన్మానిస్తున్న స్కూల్ యాజమాన్యం

దుబ్బాక, జూన్ 6: కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర అవుతున్నా విద్యాశాఖకు మంత్రి లేక సర్కారు విద్య బలహీనమవుతున్నది, విద్యార్థులు అసౌకర్యాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మంత్రి హరీశ్‌రావు అన్నారు. విద్యాసంవత్సరం పునఃప్రారంభమవుతున్న ఈ తరుణంలో విద్యార్థుల సంక్షేమాన్ని పట్టించుకునే వారు లేకపోవడం దురదృష్టకరమని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో సర్కారు విద్య గాడి తప్పిందన్నారు. శుక్రవారం దుబ్బాక పట్టణంలో రజనీకాంత్‌రెడ్డి ఇంటర్నేషనల్ స్కూల్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ కమిషన్ బక్కి వెంకటయ్య, మాజీ ఎమ్మెల్సీ ఫరూఖ్‌హుస్సేన్‌తో కలిసి హరీశ్‌రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో మందుబాబుల మంచి చెడ్డలు చూసుకునేందుకు ఎక్సైజ్ శాఖ మంత్రి ఉన్నాడు కానీ, విద్యార్థుల సంక్షేమం చూసే విద్యాశాఖకు మంత్రి లేడని ఎద్దేవా చేశారు. ఎక్సైజ్ శాఖ మంత్రి ఫుల్ యాక్టీవ్‌గా ఉన్నాడని, కొత్త కొత్త బ్రాండ్‌లు తీసుకువచ్చి మద్యం ధరలు పెంచుతూ మంత్రి చాలా బిజీగా ఉన్నారని ఎద్దేవా చేశారు.

గతేడాది ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం సరిగా లేక అనేక మంది విద్యార్థులు అనారోగ్యానికి గురై దవాఖానల పాలయ్యారని గుర్తు చేశారు. అయినా ఈ ప్రభుత్వానికి బుద్ధి రావడం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల వద్ద నుంచి డబ్బులు గుంజడం తప్ప ప్రజా సంక్షేమం గురించి ఆలోచించడం లేదని దుయ్యబట్టారు. ప్రజల నుంచి డబ్బులు ఏ విధంగా రాబట్టాలో ఆలోచనలు చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి రాకముందు ఎల్ఆర్ఎస్ ఉచితం అన్నారని, అధికారంలోకి వచ్చాక ఎల్ఆర్ఎస్ డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఈ ప్రభుత్వంలో నిత్యావసర వస్తువులు, మందు ధరలు పెంచుతూ ప్రజలపై భారం మోపడం తప్ప ఎలాంటి ప్రయోజనం లేదన్నారు.

### త్యాగానికి ప్రతీక బక్రీద్ : హరీశ్‌రావు

సిద్దిపేట కమాన్, జూన్ 6: ముస్లింలకు మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. త్యాగం, సహనం ఈ పండుగ ఇచ్చే సందేశాలన్నారు. దైవ ప్రవక్త ఇబ్రహీం మహోన్నత త్యాగాన్ని స్మరించుకుంటూ బక్రీద్ నిర్వహించుకుంటారని తెలిపారు. భక్తిభావం, విశ్వాసం, కరుణ, ఐక్యతకు సంకేతమైన బ్రకీద్‌ను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని కోరారు. ఈ పండుగ సోదరభావం, ఐక్యతకు ఆదర్శంగా నిలుస్తుందని, అల్లాహ్ ఆశీస్సులు అందరిపై ఉండాలని అభిలాషించారు. అల్లా దయతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు

### సంక్షేమ పథకాలన్నీ బంద్...

కాంగ్రెస్ సర్కారు వచ్చాక సంక్షేమ పథకాలన్నీ అటకెక్కిన్నట్లు హరీశ్‌రావు ఆరోపించారు. రైతుబీమా ఎగ్గొట్టారని, రైతు బంధు బంద్ పెట్టారన్నారు. బతుకమ్మ చీరలు, విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బంద్ పెట్టినట్లు ఆరోపించారు. సీఎం ఢిల్లీకి మూటలు పంపేందుకు బిజీగా ఉన్నారని, ఆయనకు విద్యాశాఖను చూసే సమయం ఉండడం లేదని ఎద్దేవా చేశారు. సీఎం ఇప్పటికీ 44 సార్లు ఢిల్లీకి పోయాడని, మంత్రి వర్గ విస్తరణ చేపట్టలేక పోతున్నాడని విమర్శించారు. దుబ్బాకలో రజినీకాంత్‌రెడ్డి పాఠశాల ఏర్పాటు చేయడం సంతోషకరమని, నిరుపేదలకు ఉచితంగా విద్య అందించాలని హరీశ్‌రావు సూచించారు. కార్యక్రమంలో దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, మెదక్ ఎంపీ రఘునందన్, దుబ్బాక మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ గన్నే వనితాభూంరెడ్డి, సిద్దిపేట మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సయ్య , బీఆర్ఎస్ నాయకులు వెంకటనర్సింహారెడ్డి, రొట్టే రాజమౌళి, ఎల్లారెడ్డి, యాదగిరి, స్వామి, రామస్వామిగౌడ్, వంశీ, నారాగౌడ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

# జూలైలో నర్మెట ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ ప్రారంభం

- ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ అందుబాటులోకి వస్తే రైతులకు మేలు
- హుస్నాబాద్‌కు గోడౌన్ మంజూరు చేస్తా
- త్వరలోనే రైతుభరోసా ఇస్తాం
- కేంద్రం సకాలంలో ఎరువులు ఇవ్వడం లేదు
- వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు
- హుస్నాబాద్ ప్రాంత రైతులు తెలంగాణకే ఆదర్శంగా నిలవాలి : మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్‌లో రైతు మహోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలిస్తున్న మంత్రులు పొన్నం, తుమ్మల

హుస్నాబాద్ టౌన్, జూన్ 6: రాష్ట్రంలోనే అతిపెద్ద ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ హుస్నాబాద్ సమీపంలో నర్మెటలో వచ్చేనెల అందుబాటులోకి వస్తుందని రాష్ట్ర వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు చెప్పారు. హుస్నాబాద్‌లో మూడు రోజుల పాటు నిర్వహించే రైతు మహోత్సవాన్ని శుక్రవారం బీసీ సంక్షేమం, రవాణాశాఖల మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. అంతకు ముందు మంత్రులు ఇద్దరు ఎద్దుల బండిపై హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్‌యార్డుకు చేరుకున్నారు. యార్డులో ఏర్పాటుచేసిన ఆధునిక వ్యవసాయ యంత్రాలు, విత్తనాలు, ఎరువులు, హార్టికల్చర్, సెరికల్చర్‌తో పాటు పలు రకాల ఉత్పత్తుల స్టాళ్లను ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ.. రాష్ట్రంలోని 33 జిల్లాలకు 31జిల్లాల్లో ఆయిల్‌పామ్ పంట సాగువున్నట్లు తెలిపారు. ఈ ప్రాంత రైతుల కోసం నర్మెటలో ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ సిద్ధమైందని, జూలైలో ప్రారంభిస్తామని వెల్లడించారు. హుస్నాబాద్‌లో గోడౌన్ ఏర్పాటు చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ కోరుతున్నారని, స్థలం ఇస్తే గోడౌన్ మంజూరు చేస్తామని చెప్పారు. భూమి పెరగదని, ఉన్న భూమిలోనే రైతులు కొత్త విధానాలతో ఆదాయాన్ని పెంచుకోవాలని, మానవాళికి కావాల్సిన పంటలను నాణ్యతతో పండించాలని సూచించారు. మన తాతలు రెండుకిలోల యూరియా వాడితే, మనం 150 కిలోలు వాడుతున్నామని, దీంతో మన పంటలు విదేశాలు కొనేందుకు ముందుకు రావడం లేదన్నారు. ప్రకృతి, సేంద్రియ వ్యవసాయాన్ని మనం మరిచి పోవడంతో మన పంటలకు గిరాకీ రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్త ఆలోచనలు, నూతన పరిజ్ఞానాన్ని రైతులకు ప్రభుత్వం చేరువ చేస్తున్నదని, ఇప్పటికే వెయ్యిగ్రామాలను శాస్త్రవేత్తలు సందర్శించి సూచనలు, సలహాలు ఇచ్చినట్లు తెలిపారు.

### 134 స్టాల్స్ ఏర్పాటు..

రైతు మహోత్సవాన్ని పురస్కరించుకుని హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్‌యార్డు ఆవరణలో ఎరువులు, విత్తనాలు, యంత్రాలు, వివిధ కంపెనీల ఉత్పత్తులతో పాటు పలు విభాగాలకు చెందిన 134 స్టాళ్లను ఏర్పాటు చేశారు. రైతులు స్టాళ్లను తిలకించి విత్తనాలు, కొత్త వంగడాల గురించి తెలుసుకున్నారు.

### హుస్నాబాద్ రైతులు ఆదర్శంగా నిలవాలి

మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమానికి కృషిచేస్తున్నట్లు తెలిపారు. గౌరవెల్లి ప్రాజెక్టును పూర్తిచేసేందుకు తన వంతు కృషిచేస్తున్నట్లు చెప్పారు. మారుతున్న కాలానికి అనుగుణంగా రైతులు పంటలు సాగుచేయాలన్నారు. వాణిజ్య పంటలు, యాంత్రీకరణతో రైతులు అభివృద్ధి సాధించాలని కోరారు. హుస్నాబాద్ ప్రాంత రైతులు తెలంగాణకు ఆదర్శంగా నిలిచేలా తయారుకావాలని అకాంక్షించారు. హుస్నాబాద్ ప్రాంతాన్ని వ్యవసాయంతో పాటు పరిశ్రమలు, విద్యా, పర్యాటక పరంగా అభివృద్ధిలో ముందుకు తీసుకుపోతున్నట్లు మంత్రి పొన్నం చెప్పారు. సమావేశంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ అంజి రెడ్డి, ఆయిల్‌ఫెడ్ చైర్మన్ జంగా రాఘవ రెడ్డి, గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ రాయల నాగేశ్వర్‌రావు, వ్యవసాయశాఖ కమిషనర్ గోపి, కలెక్టర్ ఎం. మనుచౌదరి, అదనపు కలెక్టర్లు గరిమా అగర్వాల్, అబ్దుల్ హమీద్, బొమ్మ శ్రీరాంచక్రవర్తి, కేడం లింగమూర్తి, కంది తిరుపతిరెడ్డి, బొలిశెట్టి శివయ్య, అధికారులు,నిపుణులు, రైతులు పాల్గొన్నారు.

హుస్నాబాద్‌లో రైతు మ